గుంతల దారి.. జారితే అంతేమరి!

● అధ్వానంగా అంతర్గత రోడ్లు
● డైమండ్‌హిల్స్‌లో సమస్యల వెల్లువ



గచ్చిబౌలి: మూడు దశాబ్దాల క్రితం ఏర్పడ్డ లే అవుట్ అది. స్థలాలపై చుట్టిముట్టిన వివాదాలతో కనీస వసతులు కరువయ్యాయి. నడిచేందుకు రోడ్లు సరిగ్గా లేవు. పారుతున్న మురుగు నీటితో రోగాల బారిన పడతామని బిక్కుబిక్కుమంటున్నారు. ఓల్డ్ ముంబై జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కొండాపూర్ డివిజన్‌లోని హైమండ్ హిల్స్‌లో 430 ప్లా ట్లు ఉన్నాయి. 15 సంవత్సరాల క్రితం అండర్ గ్రౌండ్ నిర్మాణం చేపట్టారు. పైపుల సైజు చిన్నగా ఉండ టంతో మురుగు నాటి సమస్య తీవ్రమైంది. ఇళ్ల ముందు నుంచే డ్రైనేజీ పారడంతో రోగాల బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఛిద్రమైన రోడ్లు..

డైమండ్‌హిల్స్‌లో రోడ్లు నిర్మాణం ఇప్పటి వరకు చేపట్టలేదు. కేవలం మట్టి రోడ్లు కావడంతో ఇటీవల కురిని వర్షాలకు ఛిద్రమయ్యాయి. పాదచారులు నడవలేని విధంగా, వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో నడవాలంటే గుంతలో పడిపోతామని జంకుతున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్లను అభివృద్ధి చేయాలని వారు కోరుతున్నారు. జేఎన్‌యూఆర్‌ఎం నిధులతో చేపట్టిన అండర్ గ్రౌండ్ పనులకు మరమ్మతులు చేయాలని, పెద్ద సైజు పైపులను వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లేఅవుట్‌లో ఉన్న పార్క్ స్థలాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. డైమండ్‌హిల్స్‌లో కనీస మౌలిక వసతులు కల్పించాలని డైమండ్‌హిల్స్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ సభ్యులు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్‌కు వినతి పత్రాలు ఇచ్చినా సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి ప్రతిపాదనలు రూపొందించలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



డైమండ్‌హిల్స్‌లో..





రోడ్డుపై పారుతున్న మురుగు

క్లుప్తంగా

నేడు చెక్కుల పంపిణీ

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలో పలువురికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను చందానగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్యాణ మండపంలో నేడు (సోమవారం) పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న కొండ విజయ్‌కుమార్

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ లయన్ బాబురావు జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ హోప్ ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసిన అనంతరం 300 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొండ విజయ్‌కుమార్, అధ్యక్షులు నూకల సందీప్, ట్రెజరర్ రెడ్డి ప్రవీణ్‌రెడ్డి, ప్రతినిధులు శాంతిభూషన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మారం ప్రసాద్, మల్లేష్‌యాదవ్ పాల్గొన్నారు.

హోం గార్డులను పర్మనెంట్ చేయాలి



మంత్రి ఎర్రబల్లి దయాకర్ రావుకు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: హోం గార్డులను పర్మనెంట్ చేయాలని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లాలని మంత్రి ఎర్రబల్లి దయాకర్ రావుకు తెలంగాణ హోం గార్డ్స్ అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో, తెలంగాణ వచ్చిన తర్వాత అనేక సందర్భాల్లో సీఎం కేసీఆర్ హోం గార్డులను పర్మినెంట్ చేస్తానని ప్రకటించారని మంత్రికి వివరించారు.

నృత్యం.. మంత్రముగ్ధం



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. దుబాయ్‌లో అంతర ఇనిస్టిట్యూట్‌ను స్థాపించి కూచిపూడి కళాకారులకు శిక్షణ ఇస్తున్న గురువు విమ్మిభగవదీశ్వర్ తన ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. యూఎస్ స్టెర్లింగ్‌లో నివసిస్తూ అక్కడ నాట్యమార్గం అనే భరత నాట్య నృత్య సంస్థను స్థాపించి శిక్షణ ఇస్తున్న గురువు ఇంద్రాణి దవలూరి భరతనాట్య ప్రదర్శనతో ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశారు.

ఆకట్టుకుంటున్న చేనేత, హస్తకళా ప్రదర్శన



కొనుగోలు చేస్తున్న మహిళలు

మాదాపూర్: మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో నిర్వహిస్తున్న చేనేత, హస్తకళల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. ఆదివారం సెలవురోజు కావడంతో సందర్శకులు విరివిగా ఉత్పత్తులను కొనుగోలు చేశారు. ఆగస్టు 6వ తేదీ వరకు నిర్వహించనున్న ప్రదర్శనలో చేనేత చందేరి, మహేశ్వరీ, కోసా సిల్క్ చీరలు, బాటిక్, బాగ్, కెమికల్ ప్రింట్‌లో చేనేత బెడ్ షీట్లు డ్రెస్ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. 20 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నామని ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 7 వరకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన ఫర్నిచర్ ఫెయిర్

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న ఫర్నిచర్ ఫెయిర్, థాయిలాండ్ షాపింగ్ ఫెస్టివల్ ఆదివారంతో ముగిసింది. సెలవురోజు కావడంతో సందర్శకులు ఉత్పత్తులను విరివిగా కొనుగోలు చేశారు. దేశంలోని ప్రధాన పట్టణాలకు చెందిన ఫర్నిచర్ అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ఈ ఫెయిర్‌లో సోఫాలు, డైనింగ్, డ్రస్సింగ్ టేబుల్స్, మంచాలు అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. ప్రత్యేక డిజైన్‌లతో కూడిన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకున్నాయి.

హెచ్‌సీయూలో 'క్లీనింగ్ డ్రైవ్'



సేకరించిన వ్యర్థాలు, చెత్తాచెదారం బ్యాగులతో ఏబీవీపీ నాయకులు

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలోని స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్(ఎస్‌ఎఫ్‌డీ) ఆధ్వర్యంలో ఆదివారం గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో క్లీనింగ్ డ్రైవ్ నిర్వహించారు. క్యాంపస్‌లోని మెన్స్ హాస్టల్ సీ, ఎన్ఆర్ఎస్ పరిసరాలలో వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ ఏబీవీపీ అధ్యక్షుడు అక్షయ్, కార్యక్రమ కన్వీనర్ దర్భా, బిప్లవ్ మాట్లాడుతూ.. హెచ్‌సీయూ క్యాంపస్ క్లీన్ అండ్ గ్రీన్ చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ప్రతియేటా క్యాంపస్‌లో మొక్కలు నాటడం, క్లీనింగ్ డ్రైవ్ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆకాశ్, ఫణీంద్ర, తులసీరామ్, శ్రావణ్, మహేష్, రాజేంద్ర, ధర్మవీర్, నిశాంత్, పర్ణిక, అనీల్, కైలాస్, దేవేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని కాంటినెంటల్ ఆస్పత్రి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గురు ఎన్‌రెడ్డి సూచించారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని కాంటినెంటల్ ఆస్పత్రిలోని కాంటినెంటల్ కేన్సర్ సెంటర్ ఆధ్వర్యంలో 'గిస్ట్ ఆఫ్ గిస్ట్' అనే పేరిట జీర్ణాశయంలోని స్ట్రోమల్ కణితులపై ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ట్రో ఇంటెస్టినల్ స్ట్రోమల్ ట్యూమర్స్ అరుదుగా వస్తున్నాయని, వీటికి చికిత్స చేయగలిగే పరిస్థితులున్నాయని ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ఎలాంటి రోగాలైనా తగ్గించే వైద్య సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఎవరూ అధైర్య పడొద్దన్నారు. ప్రతి ఒక్కరూ వాకింగ్, సైక్లింగ్‌తో పాటు యోగా, ధ్యానం వంటి కూడా దృష్టి సారించాలన్నారు. ఈ సదస్సులో డాక్టర్ జగన్నాథ్, డాక్టర్ ఏవీఎస్ సురేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గురు ఎన్‌రెడ్డి

కాంగ్రెస్‌లో మహిళలకు సముచిత గౌరవం



రేవంత్ రెడ్డి, సత్యం శ్రీరంగం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిళలు

టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

కూకట్‌పల్లి: టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సమక్షంలో, టీపీసీసీ అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం ఆధ్వర్యంలో ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పుణ్యవతి తాళ్లూరి, నాదెండ్ల వీరయ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి రేవంత్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. మహిళలకి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటు సమాన గౌరవాన్నిస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మంత్రి మండలిలో మహిళలకు ఎక్కువ స్థానాలను ఇచ్చి గౌరవం కల్పించిందన్నారు. వారికి వడ్డీ లేని రుణాలను అందించింది కాంగ్రెస్ పార్టీయేనని గుర్తు చేశారు.

◆ సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ.. మహిళా కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సమయం కాబట్టి ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి కంకణబద్ధులవ్వాలన్నారు. మహిళలు రాజకీయాల్లో రాణించటానికి కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పుష్పారెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షురాలు రమాదేవి, వివిధ డివిజన్‌ల అధ్యక్షురాళ్లు విజయలక్ష్మీ, అధ్యక్షురాలు రజిత, మారుతి, అధ్యక్షురాలు భారతమ్మ, బోజమ్మ, జ్యోతి, కృష్ణవేణి, రాధా తదితరులు పాల్గొన్నారు.



శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి వాహనాల రాకపోకలు మళ్లీ ఆరంభమయ్యాయి. ఆదివారం రోజు వాహనాల రాకపోకలకు అనుమతించాలని అధికారులు నిర్ణయించడంతో వాహనాలు రాకపోకలు సాగించారు. శేరిలింగంపల్లిలో కురుస్తున్న వర్షాలతో లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి రాకపోకలు వారం రోజుల పాటు నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ ప్రాంతం గుండా రాకపోకల నిలిపివేతతో ఈ ప్రాంత ప్రజలు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఉద్యోగులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. బ్రిడ్జి కింది పేరుకుపోయిన బురద, ఇసుక మేటలను జీహెచ్‌ఎంసీ అధికారులు తొలగించేందుకు చర్యలు చేపట్టారు.

ఆత్మ రక్షణకు కరాటే నేర్చుకోవాలి

మోతీనగర్: ఆత్మ రక్షణకు మార్షల్ ఆర్ట్స్ కరాటే, కుంగ్‌ఫూ వంటివి నేర్చుకోవాలని మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మాస్టర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలో కరాటే, కుంగఫూ నేషనల్ లెవెల్ చాంపియన్‌షిప్-2023 పోటీలు జరిగాయి. గాయత్రి నగర్‌కు చెందిన విద్యార్థులు రెండు గోల్డ్‌మెడల్స్, రెండు సిల్వర్, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఈ సందర్భంగా ఆయన వారిని అభినందించారు.

పరామర్శ

కూకట్‌పల్లి: మేడ్చల్ జిల్లా బీజేపీ మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజయభవానిని అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆదివారం ఆస్పత్రిలో విజయ భవానిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సరైన చికిత్స అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులకు విన్నవించారు.

అల్పాహారం అందజేత

మోతీనగర్: లయన్స్ క్లబ్ బంజారా హిల్స్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం మోతీనగర్ చౌరస్తాలో అల్పాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంజారా హిల్స్ శాఖ అధ్యక్షుడు కేల సురేష్ మాట్లాడుతూ... మొక్కల పంపిణీ, వయోవృద్ధులకు దుప్పట్లు పంపిణీ, పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, ఉచిత మెగా వైద్య శిబిరాలు, అన్నదానం వంటి ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. త్వరలో మహా మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ బాబురావు, సెక్రటరి శ్రీకాంత్, సీనియర్ సభ్యులు సత్యనారాయణ, రోణంకి జగన్నాథం, ఆవుల సంజీవ్‌పటేల్ తదితరులు పాల్గొన్నారు.

సమాజం బలంగా ఉంటేనే హిందూ ధర్మం బలపడుతుంది

మాదాపూర్: సమాజం అన్ని రంగాలలో బలంగా ఉన్నప్పుడే హిందూ ధర్మం బలపడుతుందని స్వామి విజ్ఞానసనంద పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో ఆదివారం నిర్వహించిన వరల్డ్ హిందూ కాంగ్రెస్- 2023 కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. హిందూ ధర్మం బలంగా ఉంటే దేశం ఆర్థిక పరిపుష్టి సాధిస్తుందన్నారు. వరల్డ్ హిందూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 24 నుంచి 26వ తేదీ వరకు బ్యాంకాక్‌లో వరల్డ్ హిందూ కాంగ్రెస్ మహాసభలు నిర్వహించనున్నట్టు తెలిపారు. దీనికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆర్థిక, విద్య, వైద్య, ఆరోగ్య, తదితర ఏడు అంశాలపై సదస్సు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మూడు వేలకు పైగా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. ఇప్పటికే అమెరికా దక్షిణ ఆఫ్రికా, వంటి దేశాల్లో హిందూ మహాసభలు నిర్వహించినట్టు తెలిపారు. మూడో సదస్సును బ్యాంకాక్‌లో నిర్వహిస్తున్నట్టు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ డీజీపీ అరవింద్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న స్వామి విజ్ఞానానంద్



పోస్టర్ ఆవిష్కరణ

రాయదుర్గం: విద్యార్థి, నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలపై శంఖారావం పూరించేందుకు ఏబీవీపీ హెచ్‌సీయూ శాఖ అధ్యక్షుడు అక్షయ్, కార్యదర్శి ఆకాశ్ ఆధ్వర్యంలో హెచ్‌సీయూలోని ప్రధాన గేటు సమీపంలో ఆదివారం 'కదనభేరి' సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థి, నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శంఖారావం పూరించేందుకు ఏబీవీపీ ఆధ్వర్యంలో కదనభేరి కార్యక్రమాన్ని ఆగస్టు 1న మధ్యాహ్నం 3 గంటలకు నగరంలోని పరేడ్‌గ్రాండ్‌లో నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ హెచ్‌సీయూ ఉపాధ్యక్షులు ఫణీంద్ర, తులసీరామ్, తరుణ్, సెంట్రల్ వర్కింగ్ కమిటీ సభ్యుడు శ్రావణ్, రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు మహేష్, నాయకులు రాజేంద్ర మీనా పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

కూకట్‌పల్లి: ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలకు కైత్లాపూర్‌కాలనీలో ఆదివారం బాలాజీనగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వినోద్‌కుమార్‌గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా వరద బాధితులకు ఆహారం, తాగునీరు, నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారీ వర్షాలకు రోడ్లపై వరద నీరు నిలిచిపోవడం, రవాణా సౌకర్యాలు స్తంభించడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని అన్నారు. కూకట్‌పల్లి బీజేపీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు సౌజన్యంతో అందరికీ నిత్యావసరాలను అందజేస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని వెంటనే వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకర్ రావు, గురుప్రసాద్, దేశబత్తుల సుధారవి, వినోద్‌కుమార్, శేఖర్ పాల్గొన్నారు.

ధైర్యంగా ఉండన్నా..

● గూడెం మహిపాల్‌రెడ్డిని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



పటాన్‌చెరు: అతిచిన్న వయసులోనే తండ్రికి తగ్గ తనయుడిగా రాజకీయాల్లో ఎదుగుతున్న గూడెం విష్ణువర్ధన్ రెడ్డి అకాల మరణం అత్యంత బాధాకరమని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుమారుడిని కోల్పోయి తీవ్ర విషాదంలో మునిగిన గూడెం మహిపాల్ రెడ్డిని ఆదివారం ఆమె పరామర్శించారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు. లక్షల మంది ప్రజలకు నిరంతరం సేవ చేసే ఎమ్మెల్యే మహిపాల్ కు పుత్రశోకం కలగడం బాధాకరమని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పరామర్శ

పటాన్‌చెరు టౌన్: మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆదివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డిని పరామర్శించారు. ఎంతో భవిష్యత్తు ఉన్న విష్ణు మరణం తనను తీవ్రంగా కలిచి వేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా ప్రభుత్వ విప్, అచ్చంపేట శాసనసభ్యులు గువ్వల బాలరాజు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పరామర్శించారు.

ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మ



పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. బోనాల సమర్పించి, మొక్కలు చెల్లించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు కిటకిటలాడాయి.

బీమా తీసుకుంటేనే జీవితానికి ధీమా

కాంగ్రెస్ నేత గొట్టిముక్కల వెంగళరావు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేరళ కాలనీలోని ఎన్‌సీఎస్ గార్డెన్‌లో జరిగిన తెలంగాణ సేవ ట్యాక్సీ ఆల్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్స్ బీమా పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ నాయకుడు గొట్టిముక్కల వెంగళరావు హాజరై డ్రైవర్లకు బీమా కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైవర్లు బీమా తీసుకుంటే జీవితానికి ధీమా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీడీఏ రాష్ట్ర, గౌరవ అధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, అధ్యక్షుడు పింగిలి సంపత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగపురి సంతోష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు నూనె సుధాకర్, జాయింట్ సెక్రటరీ సంజీవులు, సలహాదారులు మెరుగు నగేష్, భాస్కర్‌గౌడ్, అంజన్న, గురుమూర్తి, గోవింద్‌గౌడ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కాటు

● బామనకుంటలో చేపలు మృతి
● పీసీబీ అధికారులకు మత్స్యకారుల ఫిర్యాదు



జిన్నారం (పటాన్‌చెరు): పరిశ్రమలు వదిలిన కాలుష్య జలాలు సమీపంలోని చెరువులో కలవడంతో చేపలు మృత్యువాత పడ్డాయి. గడ్డపోతారం గ్రామం అల్లీనగర్‌లోని బామనకుంటలో ఆదివారం ఈ ఘటన చోటుచేసుకుంది. బామనికుంటలో లక్ష వరకు చేప పిల్లలను వదిలారు. ఇటీవల వర్షాలు భారీగా కురవడంతో సమీపంలోని మైలాన్, మెట్రోకెమ్ పరిశ్రమలు వదిలిన వ్యర్థ జలాలు కుంటలో కలిశాయి. దీంతో చేపలు మృత్యువాత పడ్డాయని గ్రామస్తులు, మత్స్యకారులు ఆరోపించారు. స్థానిక నాయకులు పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాలుష్య జలాలు వదిలిన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మత్స్యకారులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు.